సర్వీసు రహదారి.. ప్రమాదాలకు నెలవు

- వంతెనల నిర్మాణంపై నిర్లక్ష్యం
- కాలువలోకి దూసుకుపోతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు



బందపురం పోలవరం కుడికాలువ వద్ద ప్రమాదకరంగా హైవే సర్వీసు రోడ్డు



బందపురం వద్ద సర్వీసు రోడ్డును కాలువ గట్టుకు మరల్చిన దృశ్యం

దేవరపల్లి: జాతీయ రహదారిపై బందపురం వద్ద సర్వీసు రోడ్డు ప్రామాదాలకు నెలవుగా మారింది. ఈ సర్వీసు రోడ్డులో ప్రయాణం చేస్తున్న వాహనదారులు రాత్రి సమయంలో పోలవరం కుడి కాలువలోకి దూసుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గుండుగొలను–కొవ్వూరు జాతీయరహదారికి ఇరు వైపులా దాదాపు 70 కిలోమీటర్ల పొడవున అధికారులు సర్వీసు రోడ్డు నిర్మించారు. రెండు వరుసలుగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. దేవరపల్లి మండలం బందపురం వద్ద గల పోలవరం కుడి కాలువ, తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువల మీదుగా హైవే నిర్మాణం చేపట్టారు. నాలుగు వరుసల జాతీయ ప్రధాన రహదారికి కాలువలపై వంతెనలు నిర్మించిన అధికారులు సర్వీసు రోడ్లకు వంతెనలు నిర్మించకుండా నిర్లక్ష్యం వహించారు. కాలువల వరకూ సర్వీసు రోడ్డులో ప్రయాణించిన వాహనదారులు అక్కడకు వచ్చేసరికి వంతెన లేక ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. కాలువ వద్ద సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేసి కాలువ గట్టుకు దారి మళ్లించారు. దారి మళ్లించిన అధికారులు గట్టు రోడ్డు నిర్మాణం చేయకపోగా, కాలువ వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ కాలువలోకి దూసుకుపోయి పడి డ్రైవర్ మృతి చెందాడు. ఇటీవల మరొక లారీ అదుపు తప్పి తెల్లవారు జామున కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారు దారి తెలియక కాలువ వద్ద ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో కాలువలపై సర్వీసు రోడ్లకు వంతెనలు నిర్మించిన అధికారులు, బందపురం వద్ద నిర్మించకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో కాలువ వద్ద అంధకారంగా నెలకొని కనీస వెలుతురు లేక భయాందోళనగా ఉంటోందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. కాలువలపై సర్వీసు రోడ్లకు వంతెనలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బందపురం వద్ద పోలవరం కుడి కాలువలోకి దూసుకుపోయిన లారీ (ఫైల్)

ప్రమాదాలకు పిలుపు కాలువ వద్ద మలుపు

బందపురం వద్ద సర్వీసు రోడ్డులో పోలవరం కుడి కాలువ వద్ద ఏర్పాటు చేసిన మలుపు వద్ద సర్వీసు రోడ్డు దాదాపు 10 మీటర్ల ఎత్తుగా ఉండి రోడ్డు పల్లంగా ఉండడంతో వాహనదారులు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయి ప్రమాదాల బారినపడుతున్నారు. 2023 ఫిబ్రవరి 18న రాత్రి 11 గంటల సమయంలో భళ్లారి నుంచి రాజానగరం బియ్యం లోడుతో వెళుతున్న లారీ సర్వీసు రోడ్డులో వెళుతూ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో డ్రైవర్ పూర్ణచంద్రరావు మృతి చెందాడు. ఈఏడాది మే నెలలో ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు అదుపు తప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వాహనంలో బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఏలూరు నుంచి కాకినాడ వెళుతున్న నూకల లోడు లారీ రాత్రి సమయంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ క్యాబిన్ నుంచి దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. హైవే సర్వీస్ రోడ్డు ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. కాలువలపై వంతెనలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వంతెన నిర్మాణం ప్రతిపాదన లేదు



హైవే నిర్మాణం ప్రాజెక్టులో కాలువలపై వంతెనల నిర్మాణం ప్రతిపాదన లేదు. ప్రాజెక్టు ప్రకారం సర్వీసు రోడ్లు నిర్మించాం. కాలువల వద్ద సర్వీసు రోడ్డును మూసి వేయాల్సి ఉంది. రైతుల అభ్యంతరం కారణంగా మూసివేయలేదు. కాలువ గట్టుకు దారి మళ్లించి, సర్వీసు రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకున్నాం. కాలువలపై సర్వీసు రోడ్డుకు వంతెన నిర్మించే అవకాశం లేదు. ప్రయాణికుల రాకపోకల ఇబ్బంది కలగకుండా మలుపు ఏర్పాటు చేశాం. సర్వీస్ రోడ్డు ముగిసిన ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేశాం. విద్యుత్ దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– సురేంద్రనాథ్, పీడీ నేషనల్ హైవే, రాజమహేంద్రవరం

మలకపల్లిలో కలెక్టర్ పర్యటన



మలకపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలో బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. మలకపల్లిలో పీ 4 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ దత్తత తీసుకున్న కుటుంబం ససమంద్ర పోసిబాబుకు చెందిన ఇంటి పునర్నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. చర్మకారుడు అయిన పోశిబాబు జీవనోపాధి కోసం షాపు పెట్టు కోవడానికి గల అవకాశాలపై ఆరాతీశారు. మెయిన్‌రోడ్డు సమీపంలో షాప్ నిర్వహణకు స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీలావణ్య, జిల్లా హౌసింగ్ పీడీ భాస్కరరెడ్డి, డీఈఈ శేఖర్ బాబు, ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, మండల హౌసింగ్ ఏఈ దాదా సాహెబ్, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి, ఆర్ఐ కె రామకృష్ణ, వీఆర్వో ఎం. ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో డైవర్షన్ రాజకీయాలు



పరిమి సోమరాజు

చాగల్లు: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు పక్కనబెట్టి, అక్రమ అరెస్టులతో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమి సోమరాజు విమర్శించారు. మండలంలోని పశివేదలలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకులు పాలన మరిచి ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. లిక్కర్ స్కాం పూర్తిగా చంద్రబాబు కల్పితమని, ఈ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన మిథున్‌రెడ్డితో పాటు మిగిలిన వారు కూడా కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమని సోమరాజు అన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రెండు రోజులు అంతరాయం

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టిన నేపథ్యంలో గురు, శుక్రవారాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు పేర్కొన్నారు. దుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా చాగల్లు, నెలటూరు, లిఫ్ట్ ఇరిగేషన్, అమ్మిగుంట, ఊనగట్ల, నెలటూరు, ఎస్.ముప్పవరం, నందిగంపాడు, కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, గరగపాడు, దారవరం గ్రామాలకు ఈనెల 25 తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. చాగల్లు, గౌరిపట్నం సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ..

నల్లజర్ల: అనంతపల్లి, తెలికిచెర్ల, సంజీవపురం, పోతినీడుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 25న ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో అన్ని గ్రామాలకు, వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. వ్యవసాయ విద్యుత్‌ను ఉదయం 4 నుంచి 8 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందించనున్నట్టు ఏఈ చెప్పారు.

గ్రామదేవతకు ఆషాఢం సారె



వేగేశ్వరపురంలో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామ దేవత తుమాలమ్మవారికి ఆషాఢ మాసం సారెను భక్తులు బుధవారం సమర్పించారు. అమ్మవారికి పుట్టింటి వారు మారిశెట్టి కుటుంబీకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆషాఢం సారెను సమర్పించారు. మహిళలు పూలు, పండ్లు, మిఠాయిలు, చీరలు, పసుపు, కుంకుమ భక్తితో సమర్పించారు. గ్రామస్తులు ముందుగా ఆషాఢ సారెను బాణసంచా, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి నివేదించారు.

గోపాలమిత్రలను ఆదుకోవాలని వినతి



రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న గోపాలమిత్రలు

నల్లజర్ల: గోపాలమిత్రలుగా 25 ఏళ్లగా పనిచేస్తున్న తమను పశుసంవర్ధక శాఖలో శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరుతూ మంత్రి అచ్చంనాయుడుకు వినతిపత్రం అందజేసినట్టు గోపాలమిత్రల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, తాతిన చైతన్య, కార్యదర్శి ఐ.ఐజాక్ తెలిపారు.నల్లజర్లలో వారు మాట్లాడుతూ అర్హత గల వారి 25 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకొని పశుసంవర్ధకశాఖలో సహాయకులుగా నియమించాలని కోరినట్టు చెప్పారు. ప్రతి గోపాలమిత్రకు పీఎఫ్,ఈఎస్ఐ, జీఎఫ్, మెడికల్ రీయిబర్స్‌మెంట్ కల్పించాలని, సమానపనికి సమాన వేతనం అందించాలని కోరారు. విప్పిలి శ్రీనివాసరావు, గెడ్డాపు సూర్యనారాయణ, సుంకరప్రతాప్, యూనియన్ సభ్యులు మంత్రిని కలిసివారిలో ఉన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి



ముక్కామలలో దోమల వల్ల కలిగే వ్యాధులను వివరిస్తున్న వైద్యాధికారి ఆర్ఎస్ఎస్వీ ప్రసాద్

పెరవలి: దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ఎస్ఎస్వీ ప్రసాద్ తెలిపారు. పెరవలి మండలం ముక్కామల హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు అధికంగా వ్యాప్తిస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తణుకు యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు ఇంటి పరిసరాల్లో దోమల నిర్మూలనకు గృహిణులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ వెంకటపతి, కె సత్యనారాయణ, రాజేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాటం



రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాకు సంఘీభావం తెలుపుతున్న తానేటి వనిత

దేవరపల్లి: మద్యం అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి సంఘీభావంగా మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యంలో పార్టీ నేతలు బుధవారం రాజమహేంద్రవరం తరలివెళ్లారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు రాజమహేంద్రవరం తరలివెళ్లి మాజీ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలపై పెడుతున్న అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. గృహనిర్బంధంలో ఉన్న పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను కలిసి ఆయన పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయి ఈశ్వర్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ అన్సర్ బాషా, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాలి వేణు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, నల్లజర్ల మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఆచంట సురేష్, నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కాకులపాటి శ్రీను, గోపాలపురం మండల ఐటీ విభాగం అధ్యక్షుడు ఉక్కుసూరి సురేష్, మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు మల్లిపూడి సలీమ్, జి కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యుడు బిరుదుగడ్డ బజారయ్య తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి దీక్షను అడ్డుకోవడం దారుణం



రాచకొండ సురేష్



కఠారి సిద్ధార్థరాజు

తాళ్లపూడి(కొవ్వూరు): కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్న జక్కంపూడి రాజాను గృహం నిర్బంధం చేయడం దారుణమని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు రాచకొండ సురేష్ అన్నారు. బుధవారం సురేష్ మాట్లాడుతూ రాజమండ్రి పేపర్‌మిల్ కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను పోలీసులు గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

శాంతియుత పోరాటాలను అడ్డుకోవడం తగదు

నల్లజర్ల: రాష్ట్రంలో శాంతియుత పోరాటాలకు తావులేదా అని గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు నక్కా పండు ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో పేపరు మిల్లు కార్మికుల సమస్యలపై శాంతియుత పోరాటం చేస్తున్న రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అర్ధరాత్రి పోలీసులు గృహ నిర్బంధం చేసి ఆయన తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేయడాన్ని పండు ఖండించారు. కార్మికుల సమస్యపై స్పందిస్తున్న నాయకుడిని ప్రభుత్వం ఈవిధంగా అడ్డుకోవడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజాసమస్యలపై గొంతెత్తుతున్న రాజా వంటి వారిని అణచివేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ విధానాలకు తావులేదన్నారు.ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఇదే విధానాలు కొనసాగిస్తే ప్రజలు ఆగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందన్నారు. జక్కంపూడి శాంతియుతంగా చేపట్టే ఉద్యమాలకు తామంతా మద్దతునిస్తామన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

నిడదవోలు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను గృహ నిర్బంధం చేయడం అమానుషమని పార్టీ నిడదవోలు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. కార్మికుల కోసం పోరాడుతున్న జక్కంపూడి రాజాను గృహం నిర్బంధం చేసి ఆయన చేపట్టిన దీక్షను భగ్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిద్ధార్థ రాజు పేర్కొన్నారు. ఆంధ్ర మిల్లు యాజమాన్యం, కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికులకు చట్టపరమైన, న్యాయపరమైన వేతన సవరణ చేయడంతోపాటు సౌకర్యాలను కల్పించాలని యువజన విభాగం తరఫున డిమాండ్ చేస్తున్నట్టు ఆయన అన్నారు.

రసాయన ఎరువుల అధిక వినియోగంతో అనర్థం



చివటంలో వరిచేలను రైతులతో కలసి పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఉండ్రాజవరం: అధిక రసాయన ఎరువుల వినియోగం అనర్థదాయకమని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు అన్నారు. మండలంలో చివటం, పాలంగి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో బి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాల ఆధారంగా నిపుణుల సూచనల మేరకు ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ, రసాయన ఎరువులను తగు నిష్పత్తిలో వాడితే భూసారం సమతుల్యంగా ఉంటుందన్నారు. తద్వారా ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన ఆరోగ్యవంతమైన పంట దిగుబడి వస్తుందన్నారు. శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఏవో బి.రాజారావు మాట్లాడుతూ జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాసినులు వలన కలిగే ప్రయోజనాలను, వాటి లభ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయ, వీహెచ్‌ఏలు జగదీశ్వరీ, దుర్గ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉమ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కంకరలోడు లారీలు స్వాధీనం



పెరవలి పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన కంకర లోడు లారీలు

పెరవలి: నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా కంకరలోడుతో వస్తున్న మూడు లారీలను తనిఖీల్లో భాగంగా అడ్డుకున్నట్టు మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. పెరవలిలో ఆయన బుధవారం నిడదవోలు –నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ రహదారిలో నిత్యం వందలాది లారీలు కంకర, ఇసుకలోడు లారీలు వస్తుంటాయని అందుకే తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతానికి 3 లారీలు అదుపులోకి తీసుకుని వాటిని పెరవలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు. రికార్డులు పరిశీలించి మొదటి తప్పుగా గుర్తిస్తే రూ.25 వేలు జరిమానా వేస్తామని, అన్ని రికార్డులు బాగుంటే వదలిపెడతామని తెలిపారు.

అధిక దిగుబడి సాధించాలి



సమిశ్రగూడెంలో ఖరీఫ్ సాగుపై రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు రూరల్: తక్కువ ఎరువుల వినియోగంతో అధిక పంట దిగుబడులు సాధించేలా రైతులు సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ శివనాగు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు దాసు, వినయ్, రైతులు గోగిన శ్రీనివాస్, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, మద్దుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారికి లక్షపత్రి పూజ

నిడదవోలు : స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలో బుధవారం స్వామివారికి లక్షపత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహ శాస్త్రి పాల్గొన్నారు.

సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు



పోతవరం అంగన్‌వాడీ కేంద్రంలో టీవీ చూస్తున్న చిన్నారులు

నల్లజర్ల: చిన్నారులను ఆకర్షించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీవీ ఏర్పాటు చేశారు. బోధనాంశాలు, పాఠ్యాంశాల వివరాలు అంగన్‌వాడీ కార్యకర్త ఫోన్‌కు ప్రతి రోజూ ముందుగానే సమాచారం వస్తుంది. దీనిని కార్యకర్తలు తల్లుల గ్రూపులకు ఈ మెసేజ్ పంపించి వారిని కూడా పరోక్షంగా చిన్నారుల విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నారు. వర్క్ బుక్, పాటలు, కథలు ప్రీ స్కూల్లో నిర్వహించే ప్రతి శిక్షణ కార్యక్రమాన్ని తల్లులకు తెలియజేయడంతో ఇంటికి వచ్చిన పిల్లలకు ఆరోజు సెంటర్‌లోని శిక్షణ కార్యక్రమాలు తల్లిదండ్రులకు తెలుస్తుందని గోపాలపురం ఐసీడీఎస్ సీడీపీఓ మమ్మీ తెలిపారు.సొంత భవనాలున్న అన్ని అంగన్‌వాడీ సెంటర్లకు టీవీలు అందించినట్టు ఆమె తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్. బాలాజీ సుందరరావు బుధవారం తెలిపారు. మండలంలోని సూరాపురం గ్రామానికి చెందిన గున్నేపల్లి రాంబాబు కుమార్తె ఈనెల 22న మంగళవారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.
యువతి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 94407 96661కు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి



ప్రక్కిలంక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, సంఘ సభ్యులు

తాళ్లపూడి: నేటి సమాజంలో నిత్యావసరంగా మారిన లైటింగ్, సప్లై కంపెనీల నిర్వాహకులు నాణ్యమైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని, కరెంట్‌తో సంబంధం కలిగిన పనుల్లో పని చేసే కార్మికులు, యజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ప్రక్కిలంకలోని రావిపాటి ఫంక్షన్ హాలులో బుధవారం తాళ్లపూడి, పోలవరం, గోపాలపురం సౌండ్స్, లైటింగ్, డెకరేషన్ అండ్ సప్లై కంపెనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయానికి స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంటమని రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు గంటా కృష్ణ, సౌండ్, లైటింగ్, డెకరేషన్ సప్లై కమిటీ అధ్యక్షుడు కొండే వెంకటరమణ, ఉపాధ్యక్షుడు డీవీ, కార్యదర్శి రామబ్రహ్మం, సహాయ కార్యదర్శి సీఎచ్ రామకృష్ణ, కోశాధికారులు రమణ, కృష్ణంరాజు, శ్రీనివాస్, గోపీకృష్ణ, కిరణ్ కుమార్, రమణ, బన్ను, జయ పాల్గొన్నారు. మూడు మండలాల సంఘ సభ్యులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించండి



చివటంలో పర్యటిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఉండ్రాజవరం: మండలంలో చివటం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గ్రామస్తులు సమస్యలు ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామ సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రోడ్లను అభివృద్ధి చేయలేదని, డంపింగ్‌యార్డు ఊరికి మధ్యలో ఉండటం వలన దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో వీధి లైట్లు వెలగడం లేదని వివరించారు. ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ పీఎస్‌డీ.ప్రసాద్‌ను పిలిచి సమస్యలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళా జైలు సందర్శన

కంబాలచెరువు: స్థానిక సెంట్రల్ జైలులోని మహిళా కారాగారాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి బుధవారం సందర్శించారు. జైలులో వంటకు ఉపయోగించే ఆహార పదార్థాలు, పాటిస్తున్న ప్రమాణాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కారాగారంలో ఖైదీలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఖైదీల తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, మరే ఇతర న్యాయ సహాయానికి న్యాయసేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు.